క్లుప్తంగా

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

కొల్లూరు : ట్రాక్టర్ అదుపు తప్పి పంటకాల్వ లోకి దూసుకువెళ్లిన ఘటనలో గాయపడిన డ్రైవర్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చెరుకుపల్లి మండలం వాకవారిపాలేనికి చెందిన వాక అర్జునరావు (62) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కలప లోడ్‌తో మండలంలోని దోనేపూడి వైపు వస్తుండగా.. మగ్గాలపాలెం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి.. పక్కనే ఉన్న పంట కాల్వలోకి దూసుకెళ్లింది. ట్రక్కులో ఉన్న కలప.. అర్జునరావుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరులోని ఓ ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు.

గణతంత్ర వేడుకలకు చింతాయపాలెం విద్యార్థులు



కర్లపాలెం: బాపట్ల జిల్లా కేంద్రంలో గురువారం జరగనున్న గణతంత్ర దినోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని చింతాయపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం డి.శ్రీనివాసరావు, పీఈటీ ఎం.గోపి తెలిపారు. బుధవారం పీఈటీ మాట్లాడుతూ విద్యార్థులు మాల్‌కంబ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారని తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

పల్లెకోన(భట్టిప్రోలు): మండలంలోని పల్లెకోనలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన జి. శ్రీనివాసరావు పూరిల్లు దగ్ధమయ్యింది. రేపల్లె అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి ఎం. నాగేశ్వరరావు తన సిబ్బందితో మంటలను అదుపు చేశారు. తెలుసుకున్న రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున తనయుడు మేరుగ చందన్ నాగ్ బుధవారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20వేలు వ్యయం చేసే ఇంటి సామగ్రి, నిత్యావసర వస్తువులు, రూ.10వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, సర్పంచ్ రాజమ్మ, ఎంపీటీసీ తిరుపతి బాబు, బొల్లెద్దు ప్రతాప్, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పడమట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీరు పోస్టులకు ఇంటర్వ్యూ

చెరుకుపల్లి: రెండు వలంటీర్ పోస్టులకు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని బలుసులపాలెం సచివాలయ పరిధిలో (బీసీ జనరల్)కు ముగ్గురుని, చెరుకుపల్లి-2 సచివాలయ పరిధిలో (ఓసీ జనరల్) ఇద్దరి సర్టిఫికెట్లు పరిశీలించినట్లు తెలిపారు. ఈ నెల 31న ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రశాంతి, ఈఓపీఆర్డీ మురళి పాల్గొన్నారు.

ట్రాక్టర్లు బోల్తా..

కర్లపాలెం: మండల పరిధిలోని కర్లపాలెం, బుద్దాం గ్రామాల మధ్య ఉన్న తుంగభద్ర కాలువ వంతెన సమీపంలో బుధవారం ఉదయం, మధ్యాహ్నం ధాన్యం లోడుతో వస్తున్న రెండు ట్రాక్టర్లు బోల్తాపడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు వాహనాలను తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

నేడు గణతంత్ర దినోత్సవ వేడుకలు

రేపల్లె: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు గణతంత్ర దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్ అందజేత

పల్లెకోన(భట్టిప్రోలు): మండలంలోని కారుమూరు-పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూల్‌కు కారుమూరు పద్మాలయ రైస్‌మిల్ నిర్వాహకులు రూ.6,500లు వ్యయం చేసే ఎలక్ట్రానిక్ స్కూల్ బెల్‌ను బుధవారం అందజేశారు. హెచ్ఎం వి. నాగేశ్వరరావుకు అందించారు.

బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ చేయూత

నిజాంపట్నం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, దుస్తులు, కూరగాయలు, ఇంటి పైకప్పు కోసం టర్పాలిన్ పట్టాలు, వంట సామగ్రిని బుధవారం అందించింది. తహసీల్దార్ శిరీష నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాల పక్క బజారులోని బాధితుడు దొమతోటి యేసయ్యకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.గౌరీశంకర్, సెక్రటరీ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి

గడప గడపకు కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



అమర్తలూరులో కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. బుధవారం అమర్తలూరు మండల కేంద్రంలో గడప గడపకు కార్యక్రమం 139వ రోజుకు చేరుకుంది. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఈ సందర్భంగా మంత్రి కట్ చేశారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఏమైనా.. సమస్యలుంటే ప్రజలు తనకు నేరుగా తెలియజేయాలని చెప్పారు. తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటుమన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. 2014 ఎన్నికల్లో లెక్కలేనన్ని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన.. నారా చంద్రబాబు నాయుడు అందులో ఒక్క హామీ నెరవేర్చలేదని గుర్తుచేశారు. మరలా చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలు చేస్తారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంత్రి నాగార్జున నియోజకవర్గంలో 55 గ్రామ సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. 40 వేల గడపలకు వెళ్లి.. సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు మంత్రి మేరుగ నాగార్జునకు ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, కో-ఆప్షన్ మెంబర్ అరమండ మాణిక్యం, గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము, చదలవాడ రమేష్, దోవా రవీంద్రబాబు, పోతర్లంక సురేష్, బర్మా ప్రవీణ్ కుమార్, కొండముది భాస్కర్, నూతక్కి శంకర్, షేక్ హుస్సేన్, గ్రామ సర్పంచ్‌లు మండే నాగేశ్వరరావు, పెదపూడి ఆనంద్, పార్టీ నాయకులు గొల్లపూడి అశోక్, మానుకొండ దానియేలు, అమర్తలూరు వెంకయ్య, అంబంటి రామోహనరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

– గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ మోపిదేవి



కొత్తపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకూ.. ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఎన్నిల హామీలను 95 శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి.. వెనకడుగు వేయకుండా ప్రతి హామీని చెప్పిన సమయానికి అమలు చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరొకసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నాడు-నేడు, అమ్మ ఒడి.. వంటి పథకాల ద్వారా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు సీఎం తీసుకువచ్చారని ప్రశంసించారు. ప్రతిపక్ష పార్టీలు బూటకపు మాటలు ఎన్ని చెప్పినా.. ప్రజలు వాటిని వినే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొత్తపాలెం గ్రామ ప్రజలు అడుగడుగునా ఎంపీ మోపిదేవికి ఘనస్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని వివరిస్తూ ఎంపీ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ రవి, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీలు, గోపాలకృష్ణ, లంకె శ్రీనివాసరావు(ఎల్ఎస్ఆర్), మాజీ సర్పంచ్ రామాని కోటేశ్వరరావు, ఎంపీడీవో నాగలక్ష్మి, తహసీల్దార్ శిరీష, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల సీఎం వైఎస్ జగన్

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్ : 'ఎన్నో సంక్షేమ పథకాలు అందించారు.. పేదోళ్ల బతుకుల్లో వెలుగులు నింపారు.. జగనన్న పేదోళ్ల సీఎం.. ఆయనకే మా మద్దతు..' అంటూ వెదుళ్లపల్లి గ్రామ పంచాయతీలోని కృపానగర్ వికలాంగుల కాలనీ వాసులు ఎమ్మెల్యే కోన రఘుపతి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కొల్లా రామయ్య నగర్ కాలనీ వాసులు ఇళ్ల పట్టాల గురించి ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై అనవసర విమర్శలకు పాల్పడుతున్న ప్రతిపక్ష నేత చంద్రబాబుకు 2024 ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతు ఇచ్చి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొల్లా రామయ్య కాలనీలో ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే కోన రఘుపతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గమ్మి కృష్ణమూర్తి, సర్పంచ్ కుంచాల గోవిందమ్మ, వడ్డి ముక్కల డేవిడ్, ఎంపీటీసీ శ్రీవాణి, ఎంపీడీవో గోపాలకృష్ణ, సచివాలయం అడ్మిన్ విజయ్ సారథి, చల్లా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

నిజాంపట్నం: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ కోరారు. పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి వేతనాలు లేక అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ కార్యలయంలో వినతి పత్రాన్ని అందించారు. వై.మేరీమణి, కృష్ణకుమారి, రత్నకుమారి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116ల విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన గాజుల మార్కండేయులు, లక్ష్మీ తిరుపతమ్మ దంపతులు రూ.10,116లను విరాళంగా అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీతకు నగదు అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఉత్సాహంగా ఏఎన్‌యూ 'క్రాస్ కంట్రీ' రన్నింగ్ రేస్

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పురుషుల పరుగు పందెం (10 కి.మీ) బుధవారం ఉత్సాహంగా జరిగింది. వివిధ కళాశాలలకు చెందిన 40 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారని స్థానిక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ తెలిపారు. ఏఎన్‌యూ తరపున ఆరుగురిని క్రాస్ కంట్రీ రన్నింగ్ రేస్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాసకుమార్, ఉపాధ్యక్షుడు మంతెన శివరామరాజు ప్రారంభించారు. మొదటి బహుమతిని వేటపాలేనికి చెందిన బీబీహెచ్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఏవీ నాగార్జునరెడ్డి, ఇంకొల్లు డీసీఆర్ఎం కళాశాల విద్యార్థి ఎస్.వేణుబాబు, ఖాజీపాలేనికి చెందిన కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాల విద్యార్థి సీహెచ్ తేజ.. రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ఖాజీపాలెం డిగ్రీ కళాశాల కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ క్రాస్ కంట్రీ పరుగు పందెంలో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన వారిని ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ పోటీలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరుపున ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ మంతెన కృష్ణంరాజు, ఏఎన్‌యూ యోగ కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

జారిపడి వృద్ధురాలు మృతి

కొల్లూరు : జారి పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పోతార్లంకకు చెందిన మామిడి శ్రీరావమ్మ (70) తన గృహంలో గిన్నెలు కడిగేందుకు వెళ్తూ..కాలు జారి ఇంటి పక్కన ఉన్న సిమెంట్ రోడ్డుపైకి పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను బంధువులు హుటాహుటిన తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యశాల నుంచి సమాచారం మేరకు.. కేసు నమోదు చేసి నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాబురావు తెలిపారు.

బ్యాగులు పంపిణీ

చెరుకుపల్లి: బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ చీఫ్ మేనేజర్ టీవీ రవీంద్ర ఆధ్వర్యంలో చెరుకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 25మంది మెరిట్ విద్యార్థినులకు బ్యాంకు చెరుకుపల్లి బ్రాంచ్ ద్వారా బుధవారం స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి పాఠశాల హెచ్ఎం కె.శైలజ అధ్యక్షత వహించారు. బ్రాంచ్ మేనేజర్ ఎ.శ్రీకాంత్ మాట్లాడుతూ.. గతేడాది 17మందికి ఒక్కొక్కరికి రూ.7లక్షలకు పైగా రుణ సదుపాయం అందించినట్లు వెల్లడించారు. ఎస్సై డి.వెంకట కొండారెడ్డి, సబ్ రిజిస్ట్రార్ భీమా భాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి ఎనలేనిది



క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ మోపిదేవి తదితరులు

రేపల్లె: బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పలు సంస్కరణలను విజయవంతంగా అమలు చేస్తున్నారని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. కోలా భవానికి రెండవసారి కృష్ణ బలిజ/పూసల కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన నేపథ్యంలో పట్టణంలోని ఎంపీ నివాసంలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీల కోసం రాష్ట్రంలో 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి గ్రామస్థాయి నుంచి చైర్మన్‌ల వరకు 85,000ల మంది బీసీ ఉపకులాల వారికి పదవులను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమలో సంఘ రాష్ట్ర డైరెక్టర్ అన్నం నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు అంకమ్మరావు, నాయకులు బత్తుల శంకరరావు, యువజన జిల్లా అధ్యక్షుడు కావేటి గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల నిరసన

భట్టిప్రోలు: యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 30, 31వ తేదీలలో ఆల్ ఇండియా బ్యాంక్ ధర్నా నిర్వహిస్తున్నట్లు భట్టిప్రోలు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ లింగారెడ్డి బుధవారం తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. బ్యాంక్ ఎదుట తమ డిమాండ్‌లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఎకౌంటెంట్ సీహెచ్ వెంకట సుబ్బయ్య, క్యాష్ ఇన్‌చార్జ్ ఆర్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

28న పాండురంగ స్వామి కల్యాణోత్సవం

వేమవరం(భట్టిప్రోలు): మండలంలోని వేమవరంలో కొలువైన శ్రీ రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 28న, శనివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కల్యాణంలో పాల్గొనే దంపతులు 90004 60213 కు సంప్రదించాలని అర్చకులు ధారా నారాయణమూర్తి పేర్కొన్నారు.

ఐలవరం ఉపాధ్యాయుడికి అరుదైన అవకాశం

ఐలవరం(భట్టిప్రోలు): అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని ఆర్కాన్సా టెక్ యూనివర్సిటీ ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణకు గెస్ట్ స్పీకర్‌గా ఆహ్వానం పలికింది. ఈ మేరకు తనకు ఆన్‌లైన్ ద్వారా ఆహ్వాన పత్రం బుధవారం అందిందని హరికృష్ణ తెలిపారు. వివిధ దేశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొనే ఈ వర్చువల్ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అవలంభిస్తున్న విధానాలను గురించి తమకున్న సందేహాలను వ్యక్త పరుస్తారని వెల్లడించారు. ఈ ఏడాది భారత దేశం తరపున ఆంధ్రప్రదేశ్ నుంచి తనకు అవకాశం లభించిందన్నారు. గురువారం రాత్రి 8:30 గంటలకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సందేహాలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

మహిళాభివృద్ధికి ఎంసీఏ సేవలు ఎనలేనివి

రేపల్లె రూరల్: మహిళల అభివృద్ధికి ఎంసీఏ అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని విశ్రాంత అణు శాస్త్రవేత్త పుట్టగుంట వేణుగోపాలరావు పేర్కొన్నారు. మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఎంసీఏ) ఆధ్వర్యాన పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మహిళలకు ఉచితంగా నిర్వహిస్తున్న టైలరింగ్, జూట్‌బ్యాగ్ శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావును, ఎంసీఏకు మహాప్రస్థానం వాహనాన్ని అందించిన మహీధర్ రాణిని ఎంసీఏ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎంసీఏ అధ్యక్ష, కార్యదర్శులు జి.రామకృష్ణబాబు, జి.బాపారావు, మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు, సభ్యులు డాక్టర్ వాసుదేవరావు, ప్రభాకరరావు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి స్వామికి అన్నాభిషేకం

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించి, కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం కావించారు. ముకుంద కోలాట ప్రదర్శన అకట్టుకుంది. గురువారం శ్రీ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, సామూహిక సువాసినీ పూజ, రాత్రి ఊయల సేవ, శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

బాలికల వసతి గృహానికి టీవీ బహూకరణ

రేపల్లె: ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ బాలికల వసతిగృహం-1కు సాయిరాం జ్యూయలర్స్ నిర్వాహకుడు ఆకుల సాయిరాం, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం శ్రీదేవిలు అందించిన టీవీని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ బుధవారం వార్డెన్ ప్రసాద్‌కు అందజేశారు. వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్లు లక్ష్మీ రాజ్యం, బట్టు శ్వేత, ఏఎస్‌డబ్ల్యూఓ సత్యనారాయణ, వార్డెన్‌లు పీఎస్ఎస్ ప్రసాద్, కె.సుజాత, ప్రమోదిని, ఎస్.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు చైతన్యం కలిగి ఉండాలి

18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి

రేపల్లె: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ పొందాలని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలతో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించి, పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లు చైతన్యం కలిగి ఉండాలి

కర్లపాలెం: ఓటర్లు చైతన్యం కలిగి ఉండాలని తహసీల్దార్ కేశవ నారాయణరావు పేర్కొన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, వలంటీర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎలీషాబాబు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలలో విద్యార్థుల ప్రతిభ..

రేపల్లె రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో రేపల్లె పట్టణానికి చెందిన ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థలలోని ఆర్‌సీ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన విద్యార్థినులు డి.కావ్య, కె.దివ్య జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదగా బహుమతులను అందుకోవడం తమ కళాశాలకే గర్వకారణమని విద్యా సంస్థల అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం కళాశాలలో వారిని అభినందించారు. అధ్యాపకులు జాషువారెబ్బా, జాన్‌రెబ్బా తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కొల్లూరు : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా కొల్లూరు ఐటీఐ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి. శివత్రి వేణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఓటరు దినోత్సవం

వేమూరు: స్థానిక వేమూరు తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. రెవిన్యూ శాఖ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు పాల్గొన్నారు.

భట్టిప్రోలు హైస్కూల్‌లో..

భట్టిప్రోలు: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులచే బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి..

నగరం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని సమర్థవంతమైన ప్రభుత్వాలను ఎన్నుకోవాలని తహసీల్దారు వొర్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం తహసీల్దారు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. తహసీల్దారు కార్యాలయం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎస్వీఆర్ఎం కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



కొల్లూరులో విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ పార్థసారథి



విద్యార్థినులతో బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా